తెలుగు కళా సమతి (న్యూజెర్సీ) 1988 ఉగాది మినీ కథల పోటీలో రు. 300 గెలుపొందిన కథ




కాలనీలో ఇళ్ళు కట్టిస్తున్నాడు కాంట్రాక్టర్ కామేశ్వరరావు. పనివాళ్ళందరూ హడావిడిగా పనిలో మునిగితేలుతున్నారు. అందర్ని అజమాయిషి చేస్తూ పని పరికిస్తూ పచార్లు చేస్తున్నాడు కామేశ్వరరావు.

ఎండాకాలం కావటాన పనివాళ్ల కోసం ఏర్పాటు చేసుకున్న మంచినీళ్ళు ఎన్ని తెచ్చుకున్నా సరిపోవడం లేదు. ఎన్ని నీళ్లు తాగినా దాహం తీరటం లేదు.

ఇటుకలు అందిస్తున్నారు కొందరు. ఇటుకలు అమరుస్తూ గోడలు కడుతున్నారు ఇంకొందరు. ఓ పక్కగా సిమెంటు, ఇసుక పారల్తో తిరగ కలుపుతున్నారు కొంత మంది. సిమెంటు బస్తాలు గదిలో నుండి జారవేస్తున్నారు. అందరి పని పరిశీలిస్తూ, పురమాయిస్తూ వున్నాడు కామేశ్వరరావు.

సరిగ్గా, అప్పుడే జీపు వచ్చి ఆగింది. వినయంగా చేతులు జోడించాడు కామేశ్వరరావు జీపు దగ్గరగా వెళ్ళి. హుందాగా దిగిన ఇంజనీరు గారు మాపుడు వేలు అలా గాల్లో కదిలించారు కామేశ్వరరావు నమస్కారానికి బదులుగా.

ఓ పని కుర్రాడ్ని పిలిచి రెండు కొబ్బరి బొండాలు తెమ్మని పంపాడు కామేశ్వరరావు.

గంభీరంగా పని దగ్గరకు నడిచాడు ఇంజనీరు. అనుసరించాడు కామేశ్వరరావు.

"ఏమయ్యా ఓ బస్తా సిమెంటుకు ఎన్ని బొచ్చెలు ఇసుక పోస్తున్నారు" పని వాళ్ళని అడిగాడు ఇంజనీరు.

"పదారండి" పార కలుపుతునే చెప్పాడు. "ఆ- పదహారు బొచ్చెలా... ఏమయ్యా కామేశ్వరావ్... ఈ కొంపలన్నీ కనీసం ప్రారంభోత్సవం వరకైనా పదిలంగా వుండటానికేనా... ఒక్క బస్తా సిమెంటుకు పదహారు బొచ్చెల ఇసుకా! ఇలా అయితే నేను ఒక్క బిల్లు కూడా పాస్ చేయను. నీ ఇష్టం. మరీ అడ్డగోలుగా వుంది నీ వ్యవహారం" అంటూ కస్సుబుస్సుమన్నాడు ఇంజనీరు.

కామేశ్వరరావు మెత్తగా నవ్వేడు, మెల్లగా నవ్వేడు. ఓ రాజకీయపు నవ్వు విసిరేడు.

"అయ్యా మీరు చెప్పింది రైటే. నేకాదనడం లేదు. ఇప్పటి కాడ్నించి మీరు చెప్పిన లెక్క పెకారం, మీ ఎస్టిమేషన్ల ప్రకారం ఎన్ని బొచ్చెలు ఇసుక కలిపించమంటే అన్ని కలిపిస్తా. అందుకు మీరెంత మందిని నిఘా పెట్టినా నాకు అభ్యంతరం లేదు. మీరెప్పుడు వచ్చినా నేను మీరు చెప్పిన లెక్క ప్రకారం కలిపిత్తన్నానో లేదో కనుక్కోండి. కాకపోతే నా దొక్క చిన్న మనవి" మళ్ళీ ఇకిలించాడు కామేశ్వరావు.
"ఏమిటది" విసుగ్గా, విసురుగా అడిగాడు ఇంజనీరు.

"మీరు చెప్పిన ఎనిమిది బొచ్చెల మీద ఒకే ఒక్క బొచ్చె పాపం మా వార్డు కౌన్సిలర్ గారికి, ఒకే ఒక్క బొచ్చె మన సూపర్వైజరు గారికి, ఒక్కటంటే ఒక్క బొచ్చే జూనియర్ ఇంజనీరు గారికి, ఒక్క బొచ్చె పెద్ద ఇంజనీరు అయ్యగారికి, ఒక్క బొచ్చె కమిషనర్ గారికి, మరి... ఉదయం మంచి సాయంత్రం వరకు మీ తరపున ఇక్కడ పడుండే యన్నెమ్మార్ కుర్రోళ్లిద్దరికీ కలిపి ఒక బొచ్చె, ఇక చెప్పాల్సిందేముంది సారూ, ఇంతగా కష్టపడుతున్న తమరిగోరికీ ఒకే ఒక్క బొచ్చే, ఇంత మందికీ తలా ఒక బొచ్చే ఇచ్చినందుగ్గామా నా కోసం నేను అడుగుతున్నది ఒకే ఒక బొచ్చేసారు."

"ఇప్పుడు లెక్క చూసుకొని ఎన్ని బొచ్చెలు కలపమంటారో సెప్తే ఇక మంచి మీరు సెప్పినట్టే, అన్ని బొచ్చెలు కలిపిత్తాను" అంటూ ఇంజనీరు కళ్ళల్లోకి చూశాడు కాంట్రాక్టర్ కామేశ్వరావ్.

ఎట్లాగోట్లా చేయ్" అంటూనే అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు ఇంజనీరు.